


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 29.07.2026 | సంపుటి: 3 | సంచిక: 177 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 29.07.2026 | VOLUME : 3 | ISSUE : 177 | PAGES: 8 | COST: 2/- |


## అధికారంలోకి వస్తే హైడ్రాను రద్దు చేస్తాం



- సిరిసిల్లను అపారెల్ హబ్‌గా తీర్చిదిద్దాలి: కేటీఆర్
- హైడ్రాపై హైకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావించిన కేటీఆర్
- సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్ అభివృద్ధికి కేంద్రానికి విజ్ఞప్తి
- కాజీపేట రైల్వే డివిజన్, కొత్త రైల్వే ప్రాజెక్టులపై డిమాండ్
- డీలిమిటేషన్, నీట్, నిషేధిత భూములపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు

3



## హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూలై 28:**

హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట, బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా..పెద్దలా అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా.. పెద్దలదా.. అని వారిని నిలదీశారు.హైడ్రా తాము

మిగతా 3వ పేజీలో..



## లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

- చర్యలు లేనందునే గోబలీనా అక్రమాలు సీబీఎస్ఈకి విస్తరణ
- కేసీఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



# అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కుపాదం

- 65 మందికి పైగా ఉన్నతాధికారులపై నిఘా.. పాత ఫైళ్ల తవ్వకాలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులపై ప్రత్యేక దృష్టి
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఇంజనీరింగ్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, పోలీసు శాఖల అధికారులపై ఫోకస్
- చట్టబద్ధ అనుమతులతో ఉన్నతాధికారులపైనా చర్యలకు సిద్ధం
- సమాచారం లీక్ కాకుండా ప్రత్యేక రహస్య బృందాల ఏర్పాటు

**హైదరాబాద్, జూలై 28:**

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాష్ట్రంలో అవినీతి అధికారులపై భారీ స్థాయిలో దాడులకు వ్యూహరచన చేసింది. గత ప్రభుత్వాల హయాంలో వివిధ కారణాలతో తప్పించుకున్న అధికారుల పాత ఫైళ్లను తిరిగి పరిశీలిస్తూ, ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఇంజనీరింగ్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, పోలీసు శాఖల్లో పనిచేస్తున్న లేదా గతంలో పనిచేసిన అధికారుల అక్రమ ఆస్తులపై దృష్టి సారించింది. లంచం కేసులతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులపై ప్రత్యేకంగా విచారణ చేపడుతోంది.

**65 మందికి పైగా ఉన్నతాధికారుల జాబితా**

దాదాపు 65 మందికి పైగా ఉన్నతాధికారుల జాబితాను సిద్ధం చేసిన ఏసీబీ, వారి ఆస్తులపై ఆరు

మిగతా 3వ పేజీలో..



## ఏసీబీ చరిత్రలో సరికొత్త రికార్డు

- 1983 తర్వాత ఒక్క త్రైమాసికంలోనే అత్యధిక అవినీతి కేసుల నమోదు
- రెండో త్రైమాసిక పనితీరుపై డీజీ చారు సిన్హా సమీక్ష
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు
- అవినీతిపై మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచన

3



## గడువులోగా భూముల రీసర్వే పూర్తి చేయాలి

- ప్రజల అవగాహన కోసం గ్రామ సభలు నిర్వహించాలి
- రీ సర్వేకు కలెక్టర్లు ప్రాధాన్యమివ్వాలి
- భూ వివాదాల పరిష్కారానికి రీ-సర్వే కీలకం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి


2



## భవిష్యత్తులో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

3



## సైబర్ మోసాలకు చెక్.. కేంద్రం కీలక నిర్ణయం

- 'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' ఏర్పాటు
- ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణకు కొత్త వ్యవస్థ
- ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో రియల్ టైమ్ హెచ్చరికలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

2




## తుది దశకు చేరుకుంటున్న సర్

- డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం

**హైదరాబాద్, జూలై 28 :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ('సర్') గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి చిరునామాలను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సహా అందరూ ఎన్యూమరేషన్ పత్రాల

మిగతా 2వ పేజీలో..

## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే వీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు



2



## హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- కోట్ల రూపాయల సైబర్ మోసం
- కీలక నిందితుడు వికాస్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై 28 :**

హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా

మిగతా 2వ పేజీలో..

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

**హైదరాబాద్,జూలై 28:**

హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్‌జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్‌జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

**మొదటిపేజీ తరువాయి**

మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ □ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్ కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంకు ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని, గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. ఆ డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప్టో ఆస్తులను ఎక్స్ఛేంజిలు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంకు ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. కాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# భవిష్యత్తులో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**న్యూఢిల్లీ, జూలై 28:**



భవిష్యత్తులో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఏ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి.. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి.. అయితే అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి అని అన్నారు. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయన్నారు. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం.. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం.. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం.. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం.. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

**ఢిల్లీ, జూలై 28 :**



ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాల్సి ఉందని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది ఆలోచిస్తామని సీఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి వాటిని గందరగోళం చేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్ల బకాయిలు పెట్టిపోయిందంటూ ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, తమ ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఏపీలో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, కృష్ణయ్యలకు సూచిస్తున్నామన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని, భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంకు ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఏటా రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్క్‌లను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేశ్‌కుమార్ మీద 400 కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులున్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు.

**సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం**

అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికా (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్‌క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్ 1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధనఅభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం దేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ప్రశంసించారు.

# సైబర్ మోసాలకు చెక్.. కేంద్రం కీలక నిర్ణయం

- **'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' ఏర్పాటు**
- **ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణకు కొత్త వ్యవస్థ**
- **ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో రియల్ టైమ్ హెచ్చరికలు**
- **బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తక్షణ అలర్ట్‌లు**
- **రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ, జూలై 28:**



దేశంలో పెరుగుతున్న సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ మోసాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు *'ఇండియా డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్' (ఐడీపీఐసీ)*ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆమె లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

**ఏఐతో రియల్ టైమ్ నిఘా**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి ఐడీపీఐసీ పనిచేస్తుందని మంత్రి వివరించారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం విశ్లేషిస్తూ, అనుమానాస్పద లావాదేవీలు లేదా సైబర్ బెదిరింపులు గుర్తించిన వెంటనే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు రియల్ టైమ్ అలర్ట్‌లు జారీ చేస్తుందని తెలిపారు.

**భద్రతకు పలు వ్యవస్థలు**

ఆర్థిక రంగంలో సైబర్ భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు వ్యవస్థలను అమలు చేస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆధ్వర్యంలోని నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ మెటాడేటా ఆధారంగా సైబర్ బెదిరింపులను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తోందన్నారు.

**సమన్వయంతో సైబర్ భద్రత**

ఫైనాన్షియల్ రంగం కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న సీఎస్ఐఆర్‌టీఫిన్ సైబర్ దాడుల సమాచారాన్ని సేకరించి బ్యాంకింగ్ రంగానికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తోందని తెలిపారు. అలాగే ఆర్థిక నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం కోసం ఇంటర్‌రెగ్యులేటరీ టెక్నికల్ గ్రూప్, కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలతో కూడిన ఐబీఏ వర్కింగ్ గ్రూప్ కూడా నిరంతరం పనిచేస్తున్నాయని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

# తుది దశకు చేరుకుంటున్న 'సర్'

**మొదటిపేజీ తరువాయి**



స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనార్హం. వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. చిరునామాలు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యూమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 'సర్' ప్రక్రియ ఆగస్టు 3న ముగుస్తుంది. కేవలం ఆరు రోజులే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యూమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతున్నది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇలాంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబరు తీసుకుని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వీరందరికీ ఎన్యూమరేషన్ పత్రాలను జూన్ 25న ప్రారంభించారు.

# గడువులోగా భూముల రీ-సర్వే పూర్తి చేయాలి

**హైదరాబాద్, జూలై 28:**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీ సర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీసర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీసర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని, ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని, ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# అధికారంలోకి వస్తే హైడ్రాను రద్దు చేస్తాం

**ఢిల్లీ, జూలై 28:**

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే హైడ్రా సంస్థను రద్దు చేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. హైడ్రాపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తాయని పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర అభివృద్ధి, రైల్వే, ఐటీ, డీలిమిటేషన్, నీట్ పరీక్షల సంస్కరణలు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

**సిరిసిల్లను టెక్స్‌టైల్, అపారెల్ హబ్‌గా అభివృద్ధి చేయాలి**

సిరిసిల్లను తమిళనాడులోని తిరుప్పూర్ తరహా టెక్స్‌టైల్, అపారెల్ హబ్‌గా తీర్చిదిద్దే సామర్థ్యం ఉందని కేటీఆర్ అన్నారు. తంగళ్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి మిడ్‌మానేర్ రిజర్వాయర్ మీదుగా రైల్‌కమ్‌రోడ్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు తెలిపారు. హైదరాబాద్-వరంగల్ రైల్వే మార్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

**టైర్-2 నగరాల్లో ఐటీ, ఏఐ విస్తరణ**

కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ వంటి నగరాల్లో ఐటీ రంగాన్ని మరింత విస్తరించేందుకు కేంద్రం సహకరించాలని కోరినట్లు కేటీఆర్ తెలిపారు. వరంగల్‌లో ఇండియా ఏఐ సెంటర్, ఇండియా ఏఐ డేటా ల్యాబ్ ఏర్పాటు చేయాలని, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో సెమీకండక్టర్ డిజైన్, డీప్‌టెక్, స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించే ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

**కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కొత్త రైల్వే లైన్లకు విజ్ఞప్తి**

సౌత్ సెంట్రల్ రైల్వే పునర్వ్యవస్థీకరణలో భాగంగా కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు కేటీఆర్ వెల్లడించారు. అలాగే మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతోందని ఆరోపించారు.

**హైడ్రాపై మరోసారి విమర్శలు**

హైడ్రా తొమ్మిది తలల విషసర్పంలా మారిందని హైకోర్టు వ్యాఖ్యానించిందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి రాష్ట్రంలో నిషేధిత భూముల విస్తీర్ణం 16 లక్షల ఎకరాలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అది కోటి ఎకరాలకు చేరిందని ఆరోపించారు. సామాన్యుల ఇళ్లపైనే చర్యలు తీసుకుంటూ, అధికార పార్టీ నేతలకు చెందిన నిర్మాణాలను వదిలేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హైకోర్టు సూచనలకు అనుగుణంగా హైడ్రా సంస్థను రద్దు చేస్తామని మరోసారి స్పష్టం చేశారు.

### నీట్, డీలిమిటేషన్‌పై కేంద్రాన్ని ప్రశ్నించిన కేటీఆర్

నీట్ పరీక్షల వివాదం యువతలో ఇప్పటికే పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతీక మాత్రమేనని కేటీఆర్ అన్నారు. పరీక్షల సంస్కరణలకు సంబంధించిన బిల్లులను మంచి ఉద్దేశంతో తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఉమ్మడి వైఖరి అవలంబించాలని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ తగిన నిర్ణయం తీసుకుంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏసీబీ చరిత్రలో సరికొత్త రికార్డు

**హైదరాబాద్, జూలై 28:**

అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) 2026 రెండో త్రైమాసికంలో చారిత్రక రికార్డు నమోదు చేసింది. 1983లో ఏసీబీ ఏర్పాటైన తర్వాత ఒకే త్రైమాసికంలో అత్యధిక అవినీతి కేసులు నమోదు కావడం ఇదే తొలిసారని ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏప్రిల్-జూన్ 2026 కాలంలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఏసీబీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఈ ఘనత సంస్థ అవినీతిపై అవలంబిస్తున్న కఠిన వైఖరి, నిరంతర అప్రమత్తత, అధికారుల వృత్తి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉత్తమ అధికారులకు సత్కారం**

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఏసీబీ అధికారులు, సిబ్బంది కృషిని చారు సిన్హా అభినందించారు. పారదర్శక పాలన, సమిష్టి పనితీరు, వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించిన అధికారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'రివార్డ్ మేళా' నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

**ప్రజల విశ్వాసమే లక్ష్యం**

అవినీతి దేశాన్ని లోపల నుంచే బలహీన పరుస్తుందని పేర్కొన్న చారు సిన్హా, అధికారులు నిజాయితీ, నిష్పాక్షికతతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. చట్టపాలనను మరింత బలోపేతం చేయడంలో ఏసీబీ కీలక పాత్ర పోషించాలని అన్నారు.

**దర్యాప్తు ప్రమాణాల మరింత బలోపేతం**

ఏసీబీ ఎల్లప్పుడూ వృత్తిపరమైన, నిష్పాక్షిక, సమగ్ర దర్యాప్తుకే ప్రాధాన్యం ఇస్తుందని చారు సిన్హా స్పష్టం చేశారు. నిరంతర శిక్షణ, దర్యాప్తు ప్రమాణాల మెరుగుదల, సంస్థాగత అప్రమత్తత ద్వారా అవినీతి నిరోధక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. నిజాయితీ, జవాబుదారీతనం, సుపరిపాలన పరిరక్షణలో ఏసీబీ ముందంజలో కొనసాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం

- **ప్రైవేట్ స్థలంలో బోర్డు తొలగించాలని 24 గంటల గడువు**
- **సాహెబ్‌నగర్‌లో హైడ్రా బోర్డు తొలగించాలని ఆదేశం**
- **కొండాపూర్ భూ వివాదంలో తహసీల్దార్‌పై హైకోర్టు ఆగ్రహం**
- **ఈ నెల 30న కోర్టుకు హాజరు కావాలని తహసీల్దార్‌కు ఆదేశం**
- **హైడ్రా చర్యలపై వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న న్యాయస్థానం**

**హైదరాబాద్, జూలై 28:**

హైడ్రా వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రెండు వేర్వేరు భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్టులోని రెండు ధర్మాసనాలు హైడ్రా చర్యలను తప్పుబట్టాయి. అధికారుల నిర్లక్ష్యం, సరైన ధ్రువీకరణ లేకుండా చేపడుతున్న చర్యలపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

**సాహెబ్‌నగర్‌లో బోర్డు తొలగించాలి**

హయత్‌నగర్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ బోర్డును 24 గంటల్లో తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**కొండాపూర్ కేసులో తహసీల్దార్‌కు నోటీసు**

కొండాపూర్‌లోని మరో ప్రైవేట్ స్థలానికి సంబంధించిన కేసులో హైడ్రా అనవసరంగా జోక్యం చేసుకుందని కోర్టు పేర్కొంది. సరైన విచారణ లేకుండానే తప్పుడు సమాచారం అందించిన సంబంధిత తహసీల్దార్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు ఈ నెల 30న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని తహసీల్దార్‌ను ఆదేశించింది.

**అధికారుల నిర్లక్ష్యంపై కోర్టు అసంతృప్తి**

భూములకు సంబంధించిన అంశాల్లో పూర్తి స్థాయిలో పరిశీలన చేయకుండా చర్యలు చేపట్టడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. హైడ్రా చర్యలపై వరుసగా న్యాయస్థానం అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో ఈ పరిణామం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణపై తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ డియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌పై హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి**
**– స్థానిక అవసరాలకు తగినట్లు వీబీ జీ రామ్ జీలో పనులు చేర్చండి**

ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ కింద రాష్ట్రానికి 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం పీఎంఏవైజీ ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్లు పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు.

# నేరెళ్ల దాష్టీకం సిగ్గుతో తలదించుకునే ఘటన

**సిరిసిల్ల టౌన్, :**

నేరెళ్ల ఘటన సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సినదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. నేరెళ్ల ఘటనలో మరణించిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నేరెళ్లలో జరిగిన ఘటన రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చగా మిగిలిందన్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధికారంలో ఉన్న కుటుంబంలో తాను కూడా సభ్యురాలినేనని, అందుకు సిగ్గుతో తలదించుకుంటూ బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. కొంతమంది ధన దాహం కోసం అమాయకుల ప్రాణాలు బలైపోయాయని ఆమె ఆరోపించారు. ఇసుక లారీల కారణంగా ఒక చిన్నారి మృతి చెందడంతో ప్రజలు ఆందోళన చేపట్టగా వారిపై పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారన్నారు. ఐదు రోజులపాటు పలువురు బాధితులను తీవ్రంగా హింసించారని, వారి పరిస్థితి చూసి జైలుకు కూడా తీసుకోవడం కష్టమైందని అన్నారు. ఈ ఘటనలో బాధ్యులైన పోలీసు అధికారులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను ప్రశ్నించారు. జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ నివేదిక ఇప్పటికీ బయటకు రాకపోవడంపై ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. బాధితులకు తాము అండగా ఉంటామని, అవసరమైతే బాధితులతో కలిసి దిల్లీకి వెళ్లి ఎస్సీ కమిషన్ నివేదిక విడుదల కోసం పోరాటం చేస్తామని చెప్పారు గంధం గోపాల్ కుటుంబం తొమ్మిదేళ్లుతతగా ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సాయం అందలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి మజీద్, మాజీ మంత్రి బోడ జనార్దన్, రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, పవన్, రంజిత్, ఆనంద్, ప్రవీణ్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి నాగరాజు, మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జి చైతన్య, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్, జావిద్, మార్వాడి దేవరాజు, బైరి రాజేష్, రమావత్ మోహన్, రేణుక, మంగ, లాస్య, వీర్నపల్లి ఇన్చార్జి బండి శ్రీహరి, వేములవాడ ఇన్చార్జి తోట కనకయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు చెంతకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

**హైదరాబాద్, జూలై 28 :**

'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. 1600 రైతు వేదికల ద్వారా లక్షలాదిమంది రైతులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపయోగంగా వదిలేసిన రైతు వేదికలను రైతులకు ఉపయోగపడే విజ్ఞాన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం కార్యక్రమం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. రెండేళ్లలో 2,43,830 మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా మొత్తం 27.30 లక్షలకు పైగా రైతులు కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని వెల్లడించారు. రైతు వేదికలను డిజిటల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేసి రైతులతో ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలను కలిపిన కార్యక్రమం దేశంలోనే ఇదే తొలిసారని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలున్నాయని మంత్రి ఇలాంటి పరిస్థితులను ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.



# ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

- **'ప్రజావాణి'ని పరిశీలించిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్, జూలై 28 :**

ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2బీహెచ్‌కే గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి రోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యల ను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతీ వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం తెలిపారు.

# భూగర్భ జలాలు పెంపొందించడమే లక్ష్యం

- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**

**ములుగు, జూలై 28 :**



వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ములుగు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంతోపాటు జలసిరి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. 'ఇంటింటికీ ఇంకుడు గుంత ఊరి కోసం ఊటకుంటపంట కోసం పంట కుంట' అనే నినాదంతో ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా విస్తృతంగా పనులు చేపట్టాలని సూచించారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ మన ఇంటి సిరిగా భావించి భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ, మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుల పొలాల్లో వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి పనులు, పశువుల పాకలు, మిల్క్ షెడ్లు, పంట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు 'జలసిరి'లో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను నివారించవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జలసిరి పనులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క జలసిరి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తొలుత మల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, ఎంపీడీవో సందీప్, రహీం వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి**

నెలలుగా నిఘా పెట్టినట్లు సమాచారం. బినామీల పేర్లపై ఆస్తులు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, విదేశీ ఖాతాలకు నిధులు మళ్లించడం వంటి అంశాలపై ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. త్వరలోనే పక్కా ఆధారాలతో సోదాలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపైనా చర్యలు**

అఖిల భారత సర్వీసులకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై విచారణ లేదా సోదాలు నిర్వహించేందుకు చట్టబద్ధ అనుమతులు అవసరమైనప్పటికీ, అవసరమైన ప్రభుత్వ అనుమతులతో చర్యలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ప్రాథమిక ఆధారాలు లభించిన అధికారులపై చట్టపరమైన నిబంధనల ప్రకారం విచారణ కొనసాగించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది.

**క్వాసి-జ్యుడీషియల్ నిర్ణయాలపై విచారణ**

రెవెన్యూ, భూ సర్వే శాఖల్లో గతంలో ఇచ్చిన క్వాసిజ్యుడీషియల్ ఆదేశాలు, భూవివాదాల పరిష్కారాలు, సివిల్ కాంట్రాక్టుల మంజూరు వంటి అంశాలను ఏసీబీ తిరిగి పరిశీలిస్తోంది. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, వివాదాస్పద భూముల వ్యవహారాల్లో జరిగిన అక్రమాలపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది.

**రహస్యంగా దాడుల ప్రణాళిక**

సోదాల సమాచారం ముందుగానే బయటకు వెళ్లకుండా ప్రత్యేక రహస్య బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. డిజిటల్ ఆధారాల సేకరణ, సోదాల ప్రక్రియను సాంకేతికంగా నమోదు చేయడం వంటి విధానాలను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల నమోదైన అవినీతి కేసుల సంఖ్య పెరగడం, అక్రమ ఆస్తులపై దృష్టి పెట్టడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ఏసీబీ ముందుకు సాగుతోంది.

గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు అధికారిక ప్రకటనలు, విచారణల ఫలితాలు లేదా న్యాయస్థాన నిర్ధారణల ఆధారంగా తుది నిర్ణయాలు కావు. ఏసీబీ చర్యలు, దర్యాప్తు పురోగతి, అధికారిక ప్రకటనల ఆధారంగా తదుపరి పరిణామాలు మారే అవకాశం ఉంది.

## సంపాదకీయం



# హైడ్రా దూకుడుకు హైకోర్టు కళ్లెం!

హైడ్రా తీరు, కమిషనర్ రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. దీనిపై సమీక్షించుకోవడం, ఆత్మవిమర్శ చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించాలి. పెద్దలను వదిలి పేదల ఇళ్లను కూలస్తున్నారన్న అపప్రథ రాగానే చర్యలు తీసుకుని ఉంటే ఇంతటి అపప్రథ వచ్చేది కాదు. కానీ సిఎం రేవంత్ పదేపదే హైడ్రాను సమర్థిస్తూ వచ్చారు. అయితే హైడ్రా వల్ల మంచి పనులు జరగలేదని చెప్పడానికి లేదు. ప్రభుత్వ భూముల కబ్జా, చెరువుల కబ్జాను తొలగించడం వంటి చర్యలను ప్రజలు సమర్థి÷-తూ వస్తూనే ఉన్నారు. కానీ పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడాన్ని ఎవరూ సమర్థించరు. పేదలకు గూడు కట్టివాలనుకున్నప్పుడు వారు ఉన్న ప్రాంతాలను వారికే అప్పగించాలి. కానీ వారిని గూడులేని వారుగా చేయడం సరికాదు. హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్-హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనడంలో సందేహం లేదు. అయితే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు చెడ్డపేరు తెచ్చి పెట్టాయి. చట్టప్రకారం, నిబంధనల మేరకు నడుచుకుని ఉంటే ఇంతగా హైకోర్టు చేత చివాట్లు తినాల్సిన పని వచ్చేది కాదు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వాని చెంపపెట్టుగానే భావించాలి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది. హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమూర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగలముఠా చర్యగా పోల్చింది. రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన పక్రియను పాటించకపోతే హైడ్రాను మూసివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోక పోవడంతో హైకోర్టు ముందు దోషిగా నిలబడాల్సి వచ్చింది. లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం పరాకాష్టగా చూడాలి. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది . కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కారణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది. హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్షనేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ఇప్పటికైనా హైడ్రా తీరు మారాలి. చట్టబద్ధంగా, నిబంధనల మేరకు నడుచుకుంటే మంచిది. పేదల పక్షాలన నిలబడాల్సిన అసవరం కూడా గుర్తించాలి.

# నీట్ నిరసనకారులకు భారీ ఊరట

- మైనర్లు, నేరచరిత్ర లేని విద్యార్థులను విడుదల చేయాలి: సుప్రీంకోర్టు
- కేసుల ఉపసంహారణకు బిహార్, అస్సాం నిర్ణయం.. రాజస్థాన్ కూడా సిద్ధం



**న్యూఢిల్లీ, జూలై 28:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు సుప్రీంకోర్టు కీలక ఊరటనిచ్చింది. 18 ఏళ్లలోపు మైనర్లు, ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అలాగే నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఇదే సమయంలో బిహార్, అస్సాం ప్రభుత్వాలు విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించగా, రాజస్థాన్ ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌తో పాటు పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులపై విచారణ చేపట్టిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని స్పష్టం చేసింది. విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, దౌర్జన్యాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ధర్మాసనం, ఈ ఘటనలపై స్వతంత్ర విచారణ అవసరమని పేర్కొంది. నిర్దోషులపై దౌర్జన్యాలకు పాల్పడిన వారిని చట్టం వదిలిపెట్టదని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించే విధానంపై కూడా సుప్రీంకోర్టు దృష్టి సారించింది. శాంతిభద్రతల నిర్వహణకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన ప్రామాణిక ప్రొటోకాల్ రూపొందించాలని సూచించింది. అలాగే గాయపడిన పోలీసుల భద్రతా చర్యలపై కూడా ప్రభుత్వాలను వివరణ కోరనున్నట్లు తెలిపింది. మరోవైపు నీట్ నిరసనకారులకు ఊరట కల్పిస్తూ బిహార్, అస్సాం ప్రభుత్వాలు విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించాయి. అస్సాం హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జూలై 26 వరకు నమోదైన ఐదు కేసుల్లో అరెస్టైన 13 మందిని సమీక్షించి విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండవని కూడా స్పష్టం చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా సానుకూల హామీ ఇచ్చినట్లు పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. అస్సాం, బిహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ కేసుల ఉపసంహారణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో దేశవ్యాప్తంగా నీట్ నిరసనల్లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు గణనీయమైన ఊరట లభించింది.

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

**హైదరాబాద్, జూలై 28:**



పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హామీల అమలు కమిటీల పాత్ర చాలా గొప్పదని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామీల కమిటీదని అన్నారు. ఆవిధంగా పనిచేయాలని సూచిస్తున్నాను. నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్ధవంతమైన ,ప్రజాస్వామ్య బద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుందన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ, శాసనసభ యొక్క నియమాల కమిటీ , శాసనసభ యొక్క నైతిక విలువల కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. శాసన సభాపతిగడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణలు హాజరయ్యారు. రూల్స్ కమిటీ సమావేశానికి కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్, హాజరయ్యారు. శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ,కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. శాసనసభ చట్టాల ద్వారానే కాకుండా ఆ చట్టాలను రూపొందించే సభ్యుల ప్రవర్తన, నిబద్ధత మరియు వ్యవహార శైలి ద్వారా కూడా అంచనా వేయబడుతుందని స్పీకర్ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం మరియు ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల నమ్మకాన్ని బలోపేతం చేయడం అనే ఉద్యేశ్యంతోనే ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటరీ వ్యవస్థలో నైతిక విలువల కమిటీ అనే వ్యవస్థ అభివృద్ధి చెందింది. రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలి. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ...శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారని అన్నారు. గత ప్రభుత్వంలో రూల్స్ బుక్ ను మార్చివేశారు. శాసనసభను సమర్ధవంతంగా నడపడానికి కమిటీ అధ్యక్షులు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో రూల్స్ బుక్ ను రూపొందించాలి. శాసనసభ కమిటీలు ఇతర రాష్ట్రాలలో కూడా స్టడీ టూర్ చేసి ఆయా రాష్ట్రాల శాసనసభలలో అమలవుతున్న నిబంధనలను పరిశీలించాలి, వారి సలహాలు తీసుకోవాలని నా సూచన అని అన్నారు. సభలో నియమాలను పాటించే విదంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా ఉండే విదంగా ఎథిక్స్ కమిటీ సూచనలు ఉండాలన్నారు. కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ... శాసనసభ మాపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని పెంచుతామని

# కీలక బిల్లులుపై ఎన్డీఏ ఎంపీలతో మోడీ చర్చ

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం
- ఎన్డీఏ పక్ష ఎంపీలతో మంగళ్ మిలన్ భేటీ



**న్యూఢిల్లీ, జూలై 28:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ మంగళ్ మిలన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు-2026 ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దమనకాండకు సమాధానం చెప్పండి

**దాడి చేయమని ఎవరు ఆదేశించారు?.. కేంద్రాన్ని నిలదీసిన ప్రియాంక గాంధీ**

**యువత ఆకాంక్షలను ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదని విమర్శ**

**న్యూఢిల్లీ, జూలై 28:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు తీవ్రవాదులు కాదని, వారిపై లాఠీఛార్జ్ చేయాలని, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ప్రయోగించాలని ఎవరు ఆదేశించారని సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్స్ జరిగినా ఒక్కరిపై కూడా కఠిన చర్యలు లేకపోవడం వల్ల విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యాశాఖ కేటాయింపులను తగ్గిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో పరీక్షా విధానం ఘోరంగా విఫలమైందని, ప్రధాని మోదీ మార్చుకోవాల్సింది కెమెరా యాంగిల్స్ కాదని.. తన మనసులోని యాంగిల్స్‌ను, సలహాదారులను మార్చుకోవాలని ప్రియాంక గాంధీ హితవు పలికారు.






# "నన్ను నాటుతారు... మీరే చంపేస్తారు"

# హరితహారం పేరుతో కోట్ల దుర్వినియోగం

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకోండ పల్లి: మండలం లో కోన్ని గ్రామాలలో అధికారుల నిర్లక్ష్యానికి మొక్కల ఆవేదన "నన్ను నాటుతారు... మీరే చంపేస్తారు. నేను లేకపోతే మీకు భవిష్యత్తు లేదు" అంటూ ప్రతి మొక్కా ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, ప్రకృతి వనం పథకాల ద్వారా ప్రతి గ్రామాన్ని, ప్రతి రోడ్డును, ప్రతి ఆఫీసును పచ్చగా మార్చాలనే గొప్ప ఆకాంక్షతో లక్షలాది రూపాయలు వెచ్చించి కోట్లాది మొక్కలను నాటడం జరిగింది. ప్రతి సంవత్సరం యధావిధిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వచ్చినప్పటికీ, నాటిన మొక్కల సంరక్షణపై మాత్రం అధికారులు, ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల ఈ పథకం కేవలం బిల్లులు చేసే యంత్రంగా మారి పోయింది. నాటడం తప్ప పెంచే బాధ్యత ఎవరిదీ కాకపోవడంతో, అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో కూడా ఇష్టానుసారంగా మొక్కలు నాటి వాటికి లక్షల్లో బిల్లులు చేసి, అవి కొద్దిగా పెద్దయ్యాక "అడ్డుగా ఉన్నాయి" అనే పేరుతో మళ్లీ వాటినే నరికించే దారుణమైన పరిస్థితి రాష్ట్రంలో అన్ని చోట్లా కనిపిస్తోంది. ఇది నేరుగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్న తీరుకు నిదర్శనంగా మారింది. గత 13 సంవత్సరాలుగా ప్రతి గ్రామంలోనూ ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతున్నామని రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవానికి చాలా గ్రామాల్లో రోడ్ల వెంట ఒక్క మొక్క కూడా కనిపించని దుస్థితి ఉంది. ఎందుకంటే గతంలో వేసిన ప్లేస్ లోనే మళ్లీ మళ్లీ మొక్కలు వేసి, బిల్లులు తీసుకుని వాటిని పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ తీరులో ఎలాంటి మార్పు రాక పోవడం గమనార్హం. అధికారులు పై అధికారుల ఆదేశాల మేరకు కేవలం టార్గెట్ కోసం ఫోటోలు తీసి బిల్లులు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, మొక్కలు బ్రతికాయా లేదా, వాటికి నీళ్లు పోశారా, కంచె వేశారా అనే బాధ్యతను పూర్తిగా విస్మరిస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయల ప్రజా ధనం వృధా అవుతోంది, కార్బన్ ఉద్గారాలు తగ్గాల్సిన లక్ష్యం నెరవేరడం లేదు, రోడ్ల వెంట ప్రజలకు నీడ, చల్లదనం కరువైంది. ఈ పరిస్థితిపై ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మొక్కలు నాటే విధానంలో పూర్తి మార్పులు తీసుకురావాలని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి మూడు సంవత్సరాల పాటు సంరక్షణ బాధ్యతను కాంట్రాక్టర్లకు లేదా స్థానిక సంస్థలకు అప్పగించాలని, బ్రతికిన మొక్కలకు మాత్రమే పూర్తి బిల్లులు చెల్లించే విధానం తీసుకురావాలని, ఇప్పటికే రోడ్ల వెంట ఉన్న మొక్కలను కొట్టకుండా వాటిని కాపాడే చర్యలు చేపట్టాలని ప్రజలు మరియు ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. లేనిపక్షంలో "హరితహారం" అనే పేరు కేవలం కాగితాలకే పరిమితమై ప్రజలకు, భావితరాలకు మిగిలేది నిరాశేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శంకర్ పల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో అధ్వానంగా రోడ్లు

- వర్షపు నీరు నిలిచి దోమలు, ఈగల బెడద
- బిఆర్ఎస్ నాయకుడు శేఖర్ మద్దూరి

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ 4వ వార్డులో రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు శేఖర్ మద్దూరి వాపోయారు. రోడ్డు మొత్తం బురదమయంగా మారి, పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచింది. వాహనదారులు, పాదచారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**దోమల, ఈగల బెడదతో- రోగాల భయం**

రోడ్లపై నిలిచిన మురికి నీటి కారణంగా ఆ ప్రాంతంలో దోమలు, ఈగల బెడద విపరీతంగా పెరిగిందని, దీంతో ఇళ్లలోకి దోమలు, ఈగలు చేరి వృద్ధులు, చిన్న పిల్లలు సహా అన్ని వయసుల వారు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే 4వ వార్డులోని రోడ్లను మరమ్మతులు చేసి, వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని, అలాగే వారానికి ఒకసారి అన్ని కాలనీల్లో దోమల మందు పిచికారీ, ఫాగింగ్ చేపట్టాల వార్డు ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# ఆగస్టు 3లోపు ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి

**బీజేపీ శ్రేణులకు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సోమవారం ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ సహచర కార్యకర్తలతో కలిసి గ్రామాల వారీగా బీఎల్ఏ–2లు, బీఎల్ఓలతో సమావేశమై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. పోలింగ్ బూత్‌ల వారీగా నమోదవుతున్న వివరాలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటరు జాబితానే పునాది అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా భాగస్వామి అయ్యేలా బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే నెల 3వ తేదీలోపు ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేలా ప్రతి బూత్‌లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి కార్యకర్తల్లో మరింత సమన్వయం పెంపొందించడంతో పాటు, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తక్కల్లపల్లి నరేంద్రరావు, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు గుండా శ్రీనివాస్ రెడ్డి, భద్రం, గుండా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# 39 వ వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
**కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ సందీప్**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని 39 వ వార్డులో మంగళవారం స్థానిక కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ సందీప్ ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు జనార్ధన చారి, జూనియర్ డాక్టర్ లిసి, కావ్య వైద్య పరీక్షలు నిర్వహించి శాస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపడతామని వైద్య బృందం తెలిపింది ఈ సందర్భంగా కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ సందీప్ మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న స్థానిక ప్రజలకు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వెంపటి సురేష్, రఫీ, సత్యనారాయణ, మహేష్, నరేష్,జగదీష్, చిన్న, వేణు, జానీ, అంతటి వెంకటేష్, దినేష్, శ్రీను,శివ, శైలేష్, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# మంకాలమ్మకు కూరగాయల అలంకరణ

**ఆషాఢ మంగళవారం ఘనంగా ప్రత్యేక పూజలు**



**మాదాపూర్, రాజముద్ర న్యూస్:** గుట్టల బేగంపేట్‌లోని ప్రసిద్ధ శ్రీ మంకాలమ్మ దేవాలయంలో మంగళవారం ఆషాడ మాస ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి మంగళవారం అమ్మవారికి కూరగాయలతో అలంకరించడం ఇక్కడి ఆనవాయితీ. ఇందులో భాగంగా టమాటా, వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ తదితర వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి విగ్రహాన్ని అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎం. గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కూరగాయల అలంకరణ చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆషాడ మాసంలో చేసే ఈ ప్రత్యేక పూజలతో భక్తుల కోరికలు నెరవేరుతాయని, ప్రతి ఏటా ఇదే తరహాలో పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు..!

- నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం
- రక్త దానం చేసిన ప్రముఖ జర్నలిస్ట్ అవుట మధు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** రక్తదానం.. ప్రాణరక్షణకు మహాదానం అనే సందేశాన్ని చాటుతూ నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మంగళ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఖమ్మం జిల్లా డీసీహెచ్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో రక్తమే ప్రాణాధారమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.శిబిరంలో చెన్నారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ అవుట మధు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన రక్తం మరొకరి గుండెల్లో ఆశను నింపుతుంది. మన చిన్న సేవ ఒక కుటుంబంలో పెద్ద సంతోషాన్ని తీసుకొస్తుంది. రక్తదానం చేసిన ప్రతిఒక్కరు ఒక ప్రాణాన్ని కాపాడిన ప్రాణదాతే. యువత ముందుకొచ్చి నిరంతరం రక్తదానం చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి , డాక్టర్ రాజేష్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మాదాసు ఆదాం, సీవీఆర్ పాలేరు రిపోర్టర్ దుడ్డెల సంజయ్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.రక్తం ఇస్తే తగ్గేది కాదు పెరిగేది మానవత్వం. రక్తదానం చేస్తే నిలిచేది పేరు కాదు నిలిచేది ఒక ప్రాణం అంటూ వైద్యులు, నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించారు.

# ధాన్యం కొనుగోలు అమ్మకాలపైన శ్వేత పత్రం విడుదల చేయాలి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వంలోని ప్రముఖులు భారత ఆహార సంస్థను వ్యాపార సంస్థగా మలచి తద్వారా డబ్బులు సంపాదిస్తున్నారని దాన్ని అడ్డం పెట్టుకొని పెద్ద ఎత్తున దందా నడుస్తున్నదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలోని వజ్రా రైస్ ఇండస్ట్రీలో ఇవ్వవలసిన దాన్ని తక్కువగా ఉందని ఆరోపిస్తూ వట్టే జానయ్య యాదవ్ పైన నీలాప నిందలు వేస్తున్నారని ఈ అంశాలపై వివరణ ఇచ్చినందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భారత ఆహార సంస్థ లాభాపేక్ష లేకుండా నడపవలసిన సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం దాన్యం కొనుగోలు చేసి తమ దగ్గర దాచుకోవడానికి స్థలం లేక అడ్డగోలుగా మిల్లుల వద్ద డంపు చేసి తిరిగి బియ్యం తీసుకునే సమయంలో పద్ధతి ప్రకారం ఇవ్వాలని ప్రభుత్వం మాట్లాడటం అన్యాయమని అన్నారు. ధాన్యం మూడు సంవత్సరాల తర్వాత ఎంత తరుగు పోతుందో ఒక్కసారి కూడా ఈ ప్రభుత్వం గమనించదని, మిల్లర్లను బెదిరించి కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆయన ఆరోపించారు. గోదాంలలో స్థలం లేకపోవడం వలన మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తున్నారని అన్నారు. వట్టె జానయ్య యాదవ్ పై జరిగే దాడిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఖండిస్తుందని ఎక్కడికక్కడ ప్రభుత్వ అధికారులకు విన్నవించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, ఆవుల అంజయ్య,బొల్లె సైదులు, కోల కరుణాకర్, నెలచర్ల మధు ప్రజాపతి, సత్తు నాగయ్యతదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సాగిన సర్వసభ్య సమావేశం

**అధికారుల తీరుపై మండిపడ్డ ప్రజా ప్రతినిధులు**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా సమావేశం నిర్వహించారు. సమావేశానికి.మండల స్థాయిలో జరిగే కీలక సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడాన్ని సర్పంచ్‌లు ప్రశ్నించారు. "ప్రజా ప్రతినిధులకు .ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యత కమిటీలదా? లేక పంచాయతీ పాలకవర్గానిదా? అని సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు.ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, తప్పకుండా నిర్మించుకోవాలని, వాటి కొలతలను బట్టి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు.గ్రామాల్లో కరెంట్ వైర్లకు సంబంధించిన సమస్యలు ఉంటే అప్రమత్తంగా ఉండాలని, వెంటనే ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్,హౌసింగ్ డీఈ సుభాష్,ఏఈ శ్రీజ,తహశీల్దార్ ఉమలత, ఏవో భాను శ్రీ,ఎంపీవో తిరుపతి రెడ్డి,ఆర్ఐ నరేష్,ఏపీవో ధర్మారెడ్డి,ఏపీఎం పద్మావతి,ట్రాన్స్‌కో ఏఈ సుధాకర్,మండల సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ

**20 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం: సర్పంచ్ బండి ప్రవీణ్.**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు.ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థలాన్ని మార్కౌట్ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల 0ద్వారా రూ 20 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో కూడిన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.కొత్త భవనంలో రికార్డుల నిర్వహణకు, ప్రజా సమావేశాలకు ప్రత్యేక గదులు, ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజు,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాఫూఫ్,పాలకవర్గ సభ్యులు,జీపీ సిబ్బంది శ్రీధర్,రాజనర్సు,కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

**ఏవో భాను శ్రీ**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** వరికి బదులుగా ఆరుతడి పంటలు రైతులు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం 100 ఎపిసోడ్ ను అధికారులు, రైతులు వీక్షించారు, అనంతరం ఎల్ నీనో పరిస్థితుల వల్ల ఆరుతడి పంటలు సాగు చేయాలని విత్తనమేల నిర్వహించారు, కార్యక్రమంలో సర్పంచులు బండి ప్రవీణ్, దోకి లచ్చయ్య, సుద్దాల లింగం, గొల్ల మహేష్, ఏఈఓ లు రాకేష్, భ బీత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి...

**మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**
**బొల్లారం వెంకట్ రెడ్డి, మడపతి చంద్రమౌళి**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లిలోని మణి గార్డెన్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో మొయినాబాద్ మాజీ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు చేకూర్తి గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# ప్రజా సమస్యలపై ప్రశ్నించడం తప్పా...

- రోడ్లు బాగుచేయమని ధర్నా చేస్తే, వక్రీకరించడం న్యాయమా...
- తాము ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యేను ప్రశ్నించడం నేరమా...
- నేటి నుంచి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తాం...
- శంకర్ పల్లి బిఆర్ఎస్ నాయకులు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం బాధాకరమని శంకర్ పల్లి బిఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం రోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెట్టిన ప్రెస్ మీట్ కు స్పందనగా మంగళవారం రోజు బిఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది.

**డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అవకతవకలు: బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి**

ఏళ్లు గడుస్తున్నా గుంతల మయమైన రోడ్లకు మోక్షం లేదని...ఇప్పటికైన రోడ్లు బాగు చేయాలని శాంతియుతంగా ధర్నా చేస్తే... ఆ సమస్యను ఏ విధంగా పరిష్కరించాలని ఆలోచించాల్సింది పోయి మా బిఆర్ఎస్ నాయకుల మీద బురదజల్లే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ నాయకుల పనితీరుకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి ఏమో కానీ... ప్రజా సమస్యలు గాలికి వదిలేసి వారికి అనువైన వాళ్లకు పనులు చేయించుకోవడం అంటే ఏమిటో శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుతో తేట తెల్లామైందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 150 ఇండ్లను అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానికులకు కేటాయించగా... అందులో 108 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కాంగ్రెస్ నాయకులు అనర్హులకు, వారి అనుచరులకు కేటాయించడం జరిగిందన్నారు. అర్హులకు అందాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు... వారికి అందకపోవడంతో వారు అయోమయంలో ఉన్నారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎవరికి కేటాయించారో తెలుసుకుందామని బిఆర్ఎస్ నాయకులు అధికారుల వద్దకు వెళితే, బిఆర్ఎస్ నాయకులకు తగిన సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని శశిధర్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి మాట ఏమో కానీ... బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు అందేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని హితవు పలికారు.

**ప్రజా సమస్యలపై పోరాటం ఇకపై నిరంతరం: మాజీ ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి...**

ప్రజా సమస్యలపై పోరాటమిక నిరంతరం కొనసాగుతుందని శంకర్ పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగర్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. తాము శాంతియుతంగా రోడ్లు బాగా చేయాలని ధర్నా చేస్తే.. కాంగ్రెస్ నాయకులు దాన్ని వ్యక్తిగత విషయాలతో ముడి పెట్టడం సమంజసం కాదని, ప్రజా సమస్యపై ప్రశ్నించడం ప్రతి పౌరుడికి హక్కు ఉంటుందని, రోడ్లు బాగా లేక వాహనదారులు నానా ఇబ్బందులు పడి, ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉండడంతోనే తాము రోడ్డుపై ధర్నా చేయవలసిన పరిస్థితి నెలకొందని... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ రోడ్ల మరమ్మత్తులు చేపట్టకపోవడం బాధాకరమని ఆయన ఆరోపించారు. మెరుగైన రోడ్లు ఉన్నప్పుడే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, దాని ద్వారా మండలాలు, జిల్లాలు, రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని... అలాగే ఈ రవాణా సౌకర్యం మెరుగుపడితే వాణిజ్య పరంగా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తాము ఓటు వేసి గెలిపించుకున్న ఎమ్మెల్యేను ప్రశ్నించడం తమ హక్కు అని.. దీనిపై కాంగ్రెస్ నాయకులు లేనిపోని అపోలు సృష్టించి, ప్రజలను తప్పుదోవ పటించడం సమంజసం కాదని.... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నది కాబట్టి ఆ ఆలోచన ఏదో అభివృద్ధిపై చూపిస్తే ఎంతో బాగుంటుందని ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి శంకర్ పల్లి మండల పరిధిలోని గుంతలమయమైన రోడ్లను వెంటనే బాగు చేయాలని... అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని... లేనిచో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు.

**ప్రజా శ్రేయస్సుకై అభివృద్ధి కొరకు ముందు అడుగు వేద్దాం: జిల్లా బిఆర్ఎస్ నాయకులు వాసుదేవ్ కన్నా**

ప్రజా శ్రేయస్సుకై అందరం కలిసి అభివృద్ధికి కోసం ముందు అడుగు వేద్దామని శంకర్ పల్లి మున్సిపల్ బిఆర్ఎస్ నాయకులు వాసుదేవ్ కన్నా అన్నారు.

ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పోతే.. ఆరోపణలు మిగులుతాయని, ప్రజల సమస్యలు తీర్చే మార్గం చూడాలని, ప్రజలు ఎన్నుకుంటేనే మనమైనా, ఎమ్మెల్యే అయినా, నాయకులం అయ్యామని, అలాంటి ప్రజలను సమస్యలను గాలికి వదిలేసి, సొంత ప్రయోజనాల దిశగా అడుగులు వేయడం సమంజసం కాదని... ప్రజా ప్రయోజనమే పరమావధిక ముందడుగు వేయాలని ఆయన హితువు పలికారు. ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టియకుండా, మండల, మున్సిపల్ అభివృద్ధి కోసం ఏమి చేయాలో ఆలోచించాలని కాంగ్రెస్ నాయకులకు వాసుదేవ్ కన్నా సూచించారు. నాయకుడు అనేవాడు సొంత ప్రయోజనాలు కాకుండా... ప్రజా ప్రయోజన కోసం ఆలోచించే నాయకుడే ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ ఉంటాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ అని కాకుండా ప్రజలకు ఏది మంచి జరుగుతుందో ఆలోచించి ముందడుగు వేయాలని ఆయన కోరారు. ఇతర బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ...టిఆర్ఎస్ పార్టీలో గెలిచి, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాను అంటున్న ఎమ్మెల్యే యాదయ్య... ఇకనైనా నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో నడపాలని... ముఖ్యంగా శంకర్ పల్లి నుండి వికారాబాద్, మొమిన్ పేట్ వైపు వెళ్లే రోడ్డును, మహాలింగాపురం నుండి గాజుల కూడా వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మాయమైందని, అలాగే రావుల పల్లి కలాన్ వెళ్లే రోడ్డు ఎన్నో ఏళ్లు గడుస్తున్నా మరమ్మత్తులకు గాని... పూర్తిస్థాయి అనువైన రోడ్డుగా గాని ఏర్పడకపోవడంతో రావులపల్లి కలాన్ గ్రామస్తులు, ఈ రోడ్డు గుండానే వెళ్లే నవాబు పేట్ మండల ముబారక్ పూర్, ఎల్లకొండ గ్రామస్తుల రాకపోకలు సాగించే సమయంలో అనుభవిస్తున్న నరకయాతన గురించి ఎంత చెప్పితే అంత తక్కువ అని, అలాగే మోకిలా నుండి టంగటూరు వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా పూర్తిగా అద్వానంగా తయారైందని, పర్వేద నుండి సంకేపల్లి మీదుగా అంతప్ప గూడ వెళ్లే రోడ్డు, మెయిన్ రోడ్డు నుండి చందిప్ప గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయమై ఇరుకుగా మారిందని, మరకత శివాలయంకు వచ్చే భక్తులతో ఈ రోడ్డు రద్దీగా మారుతుందని, ఈ రోడ్డును వెంబడి విస్తరించి బాగు చేయాలని అలాగేమండల పరిధిలోని ఇతర గ్రామాల గుంతలు ఏర్పడి రాకపోకలకు అణువుగా లేని రోడ్లను వెంటనే మరమ్మతులు లేదా పూర్తిస్థాయి రాకపోకలు సాగించే రోడ్లుగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ను కోరారు. ఈ ధర్నాలు, ప్రెస్ మీట్ లు ప్రజా సమస్యల కోసమే తప్ప వ్యక్తిగతమైన ప్రయోజనాలు ఏమాత్రం లేవని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఇకపై కాంగ్రెస్ నాయకులు కూడా ప్రజాసేవలో ఏవిధంగా ముందుకు సాగాలో ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ సర్పంచ్ బిసోల్ల శ్రీధర్, లక్ష్మారెడ్డి గూడా మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, చందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, మహాలింగా ప్రమాజీ సర్పంచ్ మాణిక్ రెడ్డి, భవాని యాదగిరి, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, నరసింహా రెడ్డి, మేజర్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, ఇతర టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల నాగేందర్**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం, నేలకొండపల్లి మండలం, కొత్తకోతురు గ్రామంలో మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ మరియు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేకల నాగేందర్, ఎస్ ఐ ఆర్ పాలేరు ఇంచార్జ్ నకిరికంటి వీరభద్రం పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేకల నాగేందర్ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఎస్ ఐ ఆర్ అభియాన్ కార్యక్రమం రాష్ట్రంలోని ప్రతీ మండలంలో జరుగుతుందని తెలిపారు. బూత్ స్థాయిలో బిఎల్ఎ-2 లు ఎప్పటికప్పుడు బి ఎల్ ఎలతో సమన్వయం చేసుకుని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సజావుగా సాగేలా ఎన్నికల కమిషన్ కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నేలకొండపల్లి మండలంలో ఇప్పటికే 95% ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి కావడం చాలా సంతోషకరమని, ఇది బి ఎల్ ఎల పనితీరుకు నిదర్శనమని కొనియాడారు."బీజేపీ ఓట్లు తొలగిస్తుందని కొందరు ఎస్ ఐ ఆర్ పై దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రతీ బీజేపీ కార్యకర్త దాన్ని తిప్పి కొట్టాలి. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలో జరిగేది. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలి" అని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే బూత్ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, వాటి అమలుకు కృషి చేయాలని, పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, మండల నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం, గెల్లా చక్రపాణి, సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన వెంకట రమణ, తేజవత్ నాగరాజు, జెల్లా సురేష్, అనసూర్య, ఏపూరి సత్యనారాయణ, కాళంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీమిండియాకు గుడ్ బై చెప్పిన టెన్ డెస్కాటే..
# మళ్లీ కేకేఆర్ గూటికి!

- టీమిండియా సహాయక కోచ్ పదవి నుంచి తప్పుకున్న ర్యాన్ టెన్ డెస్కాటే
- రెండేళ్ల కాంట్రాక్ట్ ముగియడంతో కీలక నిర్ణయం
- తిరిగి ఐపీఎల్ ఫ్రాంచైజీ కేకేఆర్‌లో చేరనున్న డెస్కాటే
- గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాక జట్టులోకి వచ్చిన డెస్కాటే
- ఇతని హయాంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజయాలు.. టెస్టుల్లో పరాజయాలు

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్ జట్టు సహాయక కోచ్‌గా వ్యవహరిస్తున్న ర్యాన్ టెన్ డెస్కాటే తన పదవి నుంచి తప్పుకున్నాడు. ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ ముగిసిన వెంటనే అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో భారత జట్టుతో అతడి రెండేళ్ల బంధం ముగిసింది. త్వరలోనే డెస్కాటే ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కోచింగ్ బృందంలో చేరనున్నట్లు సమాచారం.

ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో కథనం ప్రకారం, ఇంగ్లండ్ పర్యటనలో ఉండగానే టెన్ డెస్కాటే తన నిర్ణయాన్ని బీసీసీఐకి తెలియజేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లలో భారత్ ఓటమి పాలైన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. 2024 జులైలో భారత జట్టుతో చేరిన డెస్కాటే కాంట్రాక్ట్ ఈ నెలతో ముగిసింది.

2024 టీ20 ప్రపంచకప్ తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానంలో గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. గంభీర్‌కు అత్యంత నమ్మకస్తుడిగా పేరున్న నెదర్లాండ్స్ మాజీ కెప్టెన్ డెస్కాటేను అసిస్టెంట్ కోచ్‌గా నియమించారు. జట్టులో బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాలలో అతడు కీలక సేవలు అందించాడు. అతడి హయాంలో భారత జట్టు 2025 ఆసియా కప్, 2026 టీ20 ప్రపంచకప్‌లను గెలుచుకుంది.


అయితే, ఇదే సమయంలో టెస్టు ఫార్మాట్‌లో మాత్రం జట్టు పేలవ ప్రదర్శన కనబరిచింది. ఆస్ట్రేలియా పర్యటనలో బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని కోల్పోవడమే కాకుండా, స్వదేశంలో న్యూజిలాండ్ (30), దక్షిణాఫ్రికా (20) జట్ల చేతిలో సిరీస్‌లు ఓడిపోయింది.

టెన్ డెస్కాటేకు కేకేఆర్‌తో దశాబ్దానికి పైగా అనుబంధం ఉంది. ఆటగాడిగా 2012, 2014లలో కేకేఆర్ టైటిల్ గెలిచిన జట్టులో అతడు సభ్యుడు. ఆ తర్వాత 2022 నుంచి 2024 వరకు ఫీల్డింగ్ కోచ్‌గా కూడా పని చేశాడు. ఇప్పుడు మళ్లీ అదే జట్టులోకి చేరనున్నాడు.



## నా బౌలింగ్‌ను ఐసీసీ క్లియర్ చేసింది.. అయినా అవుటైనప్పుడల్లా వేధిస్తున్నారు: పాక్ స్పిన్నర్

- అవుటైనప్పడల్లా బ్యాటర్లు తన యాక్షన్‌ను ప్రశ్నిస్తున్నారని ఉస్మాన్ తారీఖ్ ఆవేదన
- బౌలింగ్ యాక్షన్ సక్రమంగా ఉందో లేదో చూడాల్సింది అంపైర్లని, బ్యాటర్లు కాదని వ్యాఖ్య
- గతంలోనూ టామ్ బాంటన్, కామెరాన్ గ్రీన్ ఇలాగే చేశారని గుర్తుచేసుకున్న ఉస్మాన్
- పీఎస్ఎల్‌లో తన యాక్షన్‌పై ఫిర్యాదు వచ్చినా ఐసీసీ క్లియరెన్స్ ఇచ్చిందని స్పష్టీకరణ
- ఉస్మాన్ యాక్షన్ నిబంధనల ప్రకారమే ఉందని అశ్విన్ కూడా గతంలో చెప్పిన వైనం



**స్పోర్ట్స్ డెస్క్ :**

పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారీఖ్, తన బౌలింగ్‌లో అవుటైన ప్రతిసారీ బ్యాటర్లు తన బౌలింగ్ యాక్షన్‌ను ప్రశ్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటివి పునరావృతం కాకుండా అంపైర్లు, మ్యాచ్ రిఫరీలు చర్యలు తీసుకోవాలని కోరాడు.

ప్రస్తుతం ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' లీగ్‌లో బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరఫున ఆడుతున్న ఉస్మాన్, ట్రెంట్ రాకెట్స్ బ్యాటర్ టిమ్ డేవిడ్‌ను అవుట్ చేశాడు. ఆ సమయంలో డేవిడ్, ఉస్మాన్ యాక్షన్‌ను తప్పుబడుతూ నో బాల్ కోసం సైగ చేయడం వివాదానికి దారితీసింది.

ఈ ఘటనపై ఉస్మాన్ స్పందిస్తూ.."బౌలింగ్ యాక్షన్ సక్రమంగా ఉందో లేదో చూడాల్సింది అంపైర్లు, మ్యాచ్ రిఫరీలు. ఆ పని చేయడం బ్యాటర్లది కాదు. అంపైర్ నన్ను బౌలింగ్ చేయడానికి అనుమతించారంటే నా యాక్షన్ నిబంధనల ప్రకారమే ఉందని అర్థం. కానీ, అవుటైన ప్రతి బ్యాటర్ ఇలా చేయడం బాధ కలిగిస్తోంది" అని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదని ఉస్మాన్ గుర్తుచేశాడు. "దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ టీ20 లీగ్‌లో ఇంగ్లండ్ ఆటగాడు టామ్ బాంటన్ కూడా ఇలాగే ప్రవర్తించాడు. అప్పుడు అతడిని అవుట్ చేశాక నా అసహనాన్ని స్పష్టంగా తెలియజేశాను. ఈ ఏడాది ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా ఓ టీ20 మ్యాచ్‌లో నా యాక్షన్‌ను ప్రశ్నించాడు" అని వివరించాడు.

గతంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) సందర్భంగా తన యాక్షన్‌పై ఫిర్యాదు చేసినప్పటికీ, ఐసీసీ క్లియరెన్స్ ఇచ్చిందని ఉస్మాన్ స్పష్టం చేశాడు. భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా గతంలో ఉస్మాన్ యాక్షన్‌కు మద్దతుగా మాట్లాడాడు. బంతి వేసేముందు కాసేపు ఆగే అతని యాక్షన్ నిబంధనలకు లోబడే ఉందని, పైగా అలా బౌలింగ్ చేయడం చాలా కష్టమని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

"ఇకనైనా ఇది ఆగాలి. టీ20 క్రికెట్‌లో స్పిన్నర్లపై ఏమాత్రం దయ చూపరు. అందుకే నా బౌలింగ్‌లో వైవిధ్యం కోసం చాలా కష్టపడతాను. నా శ్రమను గుర్తించాలి. కానీ, ఇలా అనుమానించడం సరికాదు" అని ఉస్మాన్ తారీఖ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'ది హండ్రెడ్' లీగ్‌లో అబ్రార్ అహ్మద్ తర్వాత పాకిస్థాన్ నుంచి ఆడుతున్న ఏకైక ఆటగాడు ఉస్మాన్ కావడం గమనార్హం.

# టీమిండియాలో కొత్త ముఖం.. వయసు 33.. ఎవరీ సారాంశ్ జైన్?

- 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టుకు ఎంపికైన సారాంశ్ జైన్
- శ్రీలంకతో జరగబోయే టెస్టు సిరీస్‌కు సెలక్టర్ల నుంచి పిలుపు
- దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో గుర్తింపు
- వాషింగ్టన్ సుందర్ గాయపడటంతో దక్కిన అరుదైన అవకాశం
- తుది జట్టులో చోటు కోసం మానవ్ సుతార్‌తో తీవ్ర పోటీ



**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్‌లో పట్టుదల, నిరంతర శ్రమకు ఫలితం ఎప్పటికైనా దక్కుతుందని మరోసారి రుజువైంది. దాదాపు దశాబ్ద కాలంగా దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా గుర్తింపునకు నోచుకోని మధ్యప్రదేశ్ ఆల్ రౌండర్ సారాంశ్ జైన్, ఎట్టకేలకు 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సెలక్టర్లు అతనికి చోటు కల్పించారు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేసే సారాంశ్, టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను తన ఆరాధ్యుడిగా భావిస్తాడు.

**ఎవరీ సారాంశ్ జైన్?**

మధ్యప్రదేశ్‌కు చెందిన సారాంశ్ జైన్ తండ్రి సుబోధ్ జైన్ కూడా మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్. తండ్రి స్ఫూర్తితో క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సారాంశ్, 2014లోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. అయితే, సుదీర్ఘకాలం పాటు జట్టులో స్థానం కోసం పోరాడాల్సి వచ్చింది. 2022 వరకు కేవలం 8 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అతను, ఆ ఏడాది మధ్యప్రదేశ్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించి వెలుగులోకి వచ్చాడు. నాకౌట్ దశలో 13 వికెట్లు పడగొట్టడమే కాకుండా, ఒక అర్ధ సెంచరీతో జట్టు విజయంలో తన వంతు సహకారం అందించాడు.

ఇక గతేడాది రంజీ సీజన్ అయితే అతని కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలిచింది. బ్యాటింగ్‌లో 57.55 సగటుతో 518 పరుగులు, బౌలింగ్‌లో 20.43 సగటుతో 30 వికెట్లు తీసి ఆల్ రౌండర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దీనికి ముందు జరిగిన దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరఫున కేవలం రెండు మ్యాచ్‌లలో 16 వికెట్లు, రెండు అర్ధ సెంచరీలు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది సిరీస్" అవార్డును గెలుచుకున్నాడు. సారాంశ్ గత నెలలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా కూడా సేవలందించాడు.

**సెలక్షన్‌కు కారణం ఇదే**

రెగ్యులర్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు దూరం కావడంతో సెలక్టర్లు ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. శ్రీలంక జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటంతో, ఒక ఆఫ్ స్పిన్నర్ అవసరాన్ని గుర్తించారు. అదే సమయంలో సారాంశ్ జైన్ ఇటీవలే ఇండియాఏ జట్టుతో కలిసి శ్రీలంకలో పర్యటించాడు. అక్కడ తొలి మ్యాచ్‌లో సాధారణంగా రాణించినా, రెండో మ్యాచ్‌లో అజేయంగా 70 పరుగులు చేసి, 6 వికెట్లు పడగొట్టి తన ఎంపికకు మార్గం సుగమం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించి, జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

**అరంగేట్రం చేసే అవకాశాలు**

శ్రీలంక పిచ్‌లపై ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భారత జట్టు యాజమాన్యం భావిస్తోంది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ తుది జట్టులో ఉండటం దాదాపు ఖాయం. మూడో స్పిన్నర్ స్థానం కోసం సారాంశ్ జైన్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ఘనిస్థాన్‌పై అరంగేట్రంలోనే 7 వికెట్లు తీసి సుతార్ ఆకట్టుకున్నాడు.

అయితే, జట్టులో ఇప్పటికే జడేజా రూపంలో ఒక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఉన్నందున, మరొకరిని ఆడించేందుకు యాజమాన్యం మొగ్గు చూపకపోవచ్చు. శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం సారాంశ్‌కు కలిసొచ్చే అంశం. ఒకవేళ అతను తుది జట్టులో చోటు దక్కించుకుంటే, 1998లో రాబిన్ సింగ్ తర్వాత 33 ఏళ్ల వయసు దాటాక టెస్టు అరంగేట్రం చేసిన మరో భారత క్రికెటర్‌గా అరుదైన ఘనత సాధిస్తాడు.

## ఆ కుర్రాడిది బ్రాడ్‌మన్ టెక్నిక్.. అతడిని ఔట్ చేయడం కష్టం
# వైభవ్‌పై ఊతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు

- టీమిండియా యువ బ్యాటర్ సూర్యవంశీని డాన్ బ్రాడ్‌మన్‌తో పోల్చిన రాబిన్ ఊతప్ప
- బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూ ఔట్ చేయడం చాలా కష్టమని వ్యాఖ్య
- బౌలర్లు అతడిపై ఎక్కువగా బాడీలైన్ బౌలింగ్ ప్రయోగిస్తున్నారని విశ్లేషణ
- అధిక స్ట్రైక్‌రేట్‌తో ఇదే ఫామ్ కొనసాగిస్తే వైభవ్ ఒక 'అవుట్‌లయర్' అవుతాడని అభిప్రాయం
- ధోనీలాగే తన సహజ శైలితో ఆడుతూ వైభవ్ ప్రత్యేకంగా నిలుస్తున్నాడని ప్రశంస





**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్‌లో ప్రస్తుతం ఓ యువ సంచలనం పేరు మారుమోగిపోతోంది. అతడే వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన ఈ టీనేజ్ బ్యాటర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ విజేత రాబిన్ ఊతప్ప.. వైభవ్ బ్యాటింగ్ శైలిని ఏకంగా క్రికెట్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌తో పోల్చి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన ఊతప్ప, వైభవ్ బ్యాటింగ్ టెక్నిక్‌లో బ్రాడ్‌మన్ ఛాయలు కనిపిస్తున్నాయని విశ్లేషించాడు. "బ్రాడ్‌మన్ ఆడుతున్నప్పుడు అతడిని కట్టడి చేసేందుకు బౌలర్లు బాడీలైన్ బౌలింగ్ ప్రయోగించేవారు. ఇప్పుడు వైభవ్ విషయంలోనూ అదే జరుగుతోంది. వీరిద్దరి టెక్నిక్‌లో ఒకేరకమైన పోలిక ఉంది. బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేయడం దాదాపు అసాధ్యం" అని ఊతప్ప వివరించాడు. వైభవ్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, బౌలర్లు అతడిని ఎదుర్కోవడానికి ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారని పేర్కొన్నాడు.

అయితే, ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. "బౌలర్లు వైభవ్ బ్యాటింగ్‌కు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతానికి అతని ఆట తీరును అందరూ అర్థం చేసుకుంటున్నారు. వైభవ్ తన అద్భుతమైన స్ట్రైక్‌రేట్‌తో పాటు 40లలో బ్యాటింగ్ సగటును కొనసాగించగలిగితే, అతడు కచ్చితంగా ఒక 'అవుట్‌లయర్' (సాధారణ పద్ధతులకు భిన్నంగా అద్భుతంగా రాణించే ఆటగాడు) అవుతాడు" అని అన్నారు.

ఆధునిక క్రికెట్‌లో సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన ఆటగాళ్లు ఎక్కువగా రాణిస్తున్నారని ఊతప్ప తెలిపాడు. "ఇప్పుడు ఆటగాళ్లు సహజసిద్ధమైన ప్రతిభపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. అందుకే ఎంఎస్ ధోనీ తనదైన శైలితో విజయవంతమయ్యాడు. ఇప్పుడు వైభవ్ కూడా అదే చేస్తున్నాడు. భిన్నమైన టెక్నిక్‌లు ఇప్పుడు ఆమోదయోగ్యంగా మారాయి. అదే సమయంలో సచిన్ టెండూల్కర్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వంటి వారి సంప్రదాయబద్ధమైన ఆటను కూడా మనం ఆస్వాదిస్తాం" అని ఊతప్ప చెప్పుకొచ్చాడు.

## యువ ఆటగాళ్ల ఆకలే మా బలం..
# జింబాబ్వే సిరీస్ విజయం తర్వాత అయ్యర్

- జింబాబ్వేపై భారత్ 3-0తో క్లీన్‌స్వీప్
- యువ ఆటగాళ్లపై అయ్యర్ ప్రశంసలు
- మయాంక్ యాదవ్ ఆటతీరుపై ప్రత్యేక అభినందనలు
- వైభవ్ సూర్యవంశీ ఆరంభాలు కీలకమన్న కెప్టెన్
- ప్రతి ఆటగాడి సహకారమే విజయ రహస్యం
- తొలి టీ20 సిరీస్ విజయంపై ఆనందం



**స్పోర్ట్స్ డెస్క్ :**

జింబాబ్వేపై టీ20 సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసిన తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ యువ ఆటగాళ్లపై ప్రశంసలు కురిపించాడు. జట్టులో చోటు నిలబెట్టుకోవాలనే తపన, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఆకలే జట్టు విజయానికి ప్రధాన కారణమని చెప్పాడు. టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని వెల్లడించాడు.

కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై నాలుగు మ్యాచ్‌లు వరుసగా ఓడిపోయామని అయ్యర్ గుర్తు చేశాడు. అయితే జింబాబ్వేపై వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి క్లీన్‌స్వీప్ చేయడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందన్నాడు. ఫలితాల గురించి కాకుండా జట్టుగా ఒక ప్రమాణాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ఆడటంపైనే దృష్టి పెట్టామని వివరించాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను అయ్యర్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. మ్యాచ్‌లో ప్రతి బంతికి ముందు ఏం చేయాలని తనను అడిగేవాడని, నిర్ణయించిన ప్రణాళికను అద్భుతంగా అమలు చేశాడని కొనియాడాడు. అతడి వైఖరి, ఆటతీరు ఈ సిరీస్‌లో ప్రత్యేకంగా నిలిచాయని తెలిపాడు.

యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా జట్టుకు అద్భుతమైన ఆరంభాలు అందించాడని అయ్యర్ చెప్పాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అతడు ఇచ్చిన శుభారంభం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిందన్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా తమవంతు బాధ్యతను నిర్వర్తించారని పేర్కొన్నాడు. ప్రతి ఆటగాడు తన పాత్రను సమర్థంగా పోషించినప్పుడే విజయాలు సాధ్యమవుతాయని, జింబాబ్వే సిరీస్‌లో అదే జరిగిందని అయ్యర్ అభిప్రాయపడ్డాడు.



# పారితోషికంగా 20కోట్లు?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని టాప్ 5 హీరోయిన్లలో సాయిపల్లవి కచ్చితంగా ఉంటారు. ఇప్పటివరకూ సాయిపల్లవి రిజక్ట్ చేసిన సినిమాలు ఉన్నాయి గానీ, సాయిపల్లవిని రిజక్ట్ చేసిన సినిమాలు లేవు. దటీజ్ సాయిపల్లవి. ఆమెను మెప్పించాలంటే ముందు మంచి కథతో వెళ్లాలనేది దేశవ్యాప్తంగా ఉన్న దర్శకనిర్మాతల మాట.కథకు, పాత్రకూ తొలిప్రాధాన్యతనిచ్చే సాయిపల్లవి.. అసలు పారితోషికం ఎంత తీసుకుంటుంది? అనేది మాత్రం చాలామందికి తెలీదు. కానీ ప్రస్తుతం బీటౌన్ సమాచారం ప్రకారం నితేష్ తివారీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న 'రామాయణ' చిత్రానికి రెండు భాగాలకు గాను రూ.20 కోట్లను ఆమె రెమ్యునరేషన్‌గా అందుకుంటున్నదని తెలిసింది. అంటే సినిమా పదికోట్లన్నమాట. ఈ స్థాయి పారితోషికం అందుకునే తారలు ఇండియాలో అరుదు.



# అనుకున్న సమయానికే ఇరుముడి

మాస్ మహారాజ రవితేజ హీరోగా ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే 'ఇరుముడి'. అనౌన్స్ చేసిన నాటి నుంచే మంచి పాజిటివ్ హైప్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రంని మేకర్స్ ది ప్యారడైజ్ డేట్ ఆగష్టు 21కి లాక్ చేసిన సంగతి తెలిసిందే. కానీ తాజాగా సినిమా వాయిదా పడింది అని ఏకంగా డిసెంబర్ కి వెళ్ళిపోయింది అంటూ వచ్చిన రూమర్స్ ఫ్యాన్స్ ని నిరాశకి లోను చేసాయి. కానీ వీటికి చెక్ పెడుతూ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ ఇంకా రవితేజ సన్నిహిత వర్గాల నుంచి కూడా అనుకున్న సమయానికే ఇరుముడి ఆగమనం అని ఖరారు చేశారు. అయితే ఇక్కడ నుంచే అసలు టెస్ట్ మొదలు అని చెప్పాలి. సినిమా నుంచి ఇప్పటికి తక్కువ కంటెంట్ నే విడుదల చేశారు కానీ చేసింది హిట్టయ్యింది. ఇప్పుడు సమయం తక్కువ ఉంది కాబట్టి కాలయాపన చేయకుండా సినిమా అప్డేట్స్ వరుసగా వదలాల్సిందే. మరి వీటిని ఎలా ప్లాన్ చేసి ఆడియెన్స్ ముందుకు సినిమా తీసుకొస్తారో చూడాలి.

ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



# ది ప్యారడైజ్ నుంచి బ్లాస్టింగ్ అప్‌డేట్..

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దసరా వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా మంచి బజ్ ఏర్పడింది. తాజాగా ఈ సినిమా గురించి దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. చిత్రబృందం రాత్రింబవళ్లు శ్రమిస్తూ షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నట్లు సమాచారం. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి సన్నివేశాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.ఇటీవల విడుదలైనa 'ఆయా షేర్' ప్రమోషనల్ కంటెంట్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ వీడియో ఇప్పటికే 20 కోట్ల (200 మిలియన్) వ్యూస్ దాటిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేసిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, అభిమానులకు మరో సర్‌ప్రైజ్ ప్రకటించారు. త్వరలోనే 'ది ప్యారడైజ్' నుంచి ఓ బ్లాస్టింగ్ టీజర్ విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, ఆ టీజర్‌లోనే సినిమా కొత్త విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో నాని అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో నాని సరసన కాయదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్, సీనియర్ నటుడు మోహన్ బాబు, తనికెళ్ల భరణి, సంపూర్ణేష్ బాబు, బాబు మోహన్, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# యోధురాలి పాత్రలో బాలీవుడ్ బ్యూటీ!

పాన్ ఇండియా స్టార్ రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చారిత్రక చిత్రం ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పై మరో ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితకథ ఆధారంగా ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా హీరోయిన్ ఎంపికకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది.ఈ సినిమాలో బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఆమె చరిత్రలో తన ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన బేలవాడి మల్లమ్మ పాత్రను పోషించనుంది. శౌర్యం, త్యాగం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ పాత్ర సినిమాలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం.భూమి పెడ్నేకర్ ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు తొలిసారి ఇలాంటి చారిత్రక యోధురాలి పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కాగా, 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిషబ్ శెట్టి, ఇప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ వ్యక్తిత్వం, యుద్ధ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను తెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కథ, విజువల్ డిజైన్, యుద్ధ సన్నివేశాలు, సెట్ల రూపకల్పన వంటి అంశాలపై చిత్రబృందం చాలా కాలంగా కసరత్తు చేస్తోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com